క్లుప్తంగా

ఎంవీపీ సీఐగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



స్టేషన్ సిబ్బంది సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ప్రసాద్

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ శాంతి భద్రతల పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేఎస్ఎస్‌వీ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం తన కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంవీపీ శాంతి భద్రతల పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలు అందించిన ప్రసాద్ ప్రస్తుతం ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐగా సేవలు అందిస్తున్నారు. అయితే ఇటీవల నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆయన్ని ఎంవీపీ లా అండ్ ఆర్డర్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సీఐ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విధి నిర్వహణలో శక్తివంచన లేకుండా బాధితులకు సేవలు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయనకు స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ధనుంజయ్ నాయుడు, ఏఎస్ఐ లోవరాజుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామికి నివాళి



పెరియార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

ఏయూ క్యాంపస్ : సంఘ సంస్కర్త పెరియార్ ఇ.వి.రామస్వామి జయంతిని పురస్కరించుకుని పలువురు బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణ మూర్తి మాట్లాడుతూ అణగారిన, వెనుకబడిన కులాల అభ్యున్నతికి రామస్వామి కృషి చేశారన్నారు. భారత నాస్తిక సమాజం కన్వీనర్ జె.రవి మాట్లాడుతూ మహిళా స్వేచ్ఛకు పెరియార్ చేసిన కృషి నిరుపమానమన్నారు. అంటరానితనం నిర్మూలన, దళితులకు విద్య వంటి హక్కుల కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టి.శ్రీరామమూర్తి, ఎం.షైడిరాజు, పి.పెంటారావు, గణపతి, వై.నూకరాజు, సునీత, నాగమణి పాల్గొన్నారు.

విమ్స్‌లో మహిళలకు ఉచిత వైద్య సేవలు



విమ్స్‌లో మహిళ ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్న వైద్యుడు

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందించే శిబిరం బుధవారం ప్రారంభమైంది. ఇక్కడ క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, ఈఎన్‌టీ, కళ్లు, ఊపిరితిత్తులు, అధిక బరువు తదితర సమస్యలతో బాధపడుతున్న మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది బుధవారం పలువురు మహిళలకు ఉచిత సేవలు అందించారు. దీని కోసం ఇక్కడ ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంచారు.

యూజీడీకి మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు : యూజీడీ పాడైపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారని సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో మునసబు వారి వీధిలో గత మూడు రోజులగా యూజీడీ నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. సిబ్బంది బుధవారం మరమ్మతులు చేపట్టి మురుగునీరు బయటకు రాకుండా కట్టడి చేశారు.

పడకేసిన పారిశుధ్యం



కాలువలో నిలిచిపోయిన మురుగు నీరు



పూడికతో నిండిపోయిన కాలువ



కేఆర్ఎం కాలనీ కాలువలో పేరుకుపోయిన చెత్త

- జీవీఎంసీ 16, 23వ వార్డుల్లో కంపుకొడుతున్న కాలువలు
- పట్టించుకోని పారిశుధ్య సిబ్బంది
- దోమలు, ఈగల మోతతో కాలనీవాసుల ఇక్కట్లు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16, 23వ వార్డుల్లో ఏ కాలువ చూసినా పూడికలు, చెత్తతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. ఈ వార్డుల్లో పారిశుధ్యం పడకేయడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో స్మార్ట్‌సిటీ పేరు కాస్తా మసకబారుతోంది. మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు గతంలో కాలువలను ఆధునికీకరించి అడుగు భాగాన కాంక్రీట్ వేశారు. అయితే తర్వాత సిబ్బంది పూడికలు తొలగించకపోవడంతో మురుగు ప్రవాహం ముందుకు సాగడం లేదు. కాలువల సమీపంలోని కాలనీల వాసులు ఇష్టానుసారంగా చెత్తను కాలువల్లో వేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా విశాఖ నగర నడిబొడ్డున ఉన్న మద్దిలపాలెంలో ఏ వీధిలో కాలువ చూసినా దుర్వాసనతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది కాలువల్లోని పూడికలు ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. దీంతో పేరుకుపోయిన చెత్తతో, మురుగు నిల్వలతో దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలో పేరుకుపోయిన చెత్త కుళ్లిపోవడంతో ఆ పక్క నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. మద్దిలపాలెం ఆటో మోటివ్ పరిసర ప్రాంతాల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది.

రోడ్లపై కుప్పలుగా చెత్త

మద్దిలపాలెంలో గల వీధి రోడ్లన్నీ ఎక్కడికక్కడ చెత్త కుప్పలతో నిండిపోయాయి. ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో కుక్కలు అక్కడకు చేరి చెల్లాచెదారం చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతం అధ్వానంగా తయారవుతోంది. ఆ చెత్త కుప్పలపై ఈగలు, దోమలు చేరుతున్నాయి. దుర్వాసనతో పాటు పగటి పూట ఈగల మోత... సాయంత్రమైతే దోమల బెడదతో కాలనీవాసులు సతమతమవుతున్నారు. కాలువలు, రోడ్ల మీద చెత్త కుప్పలపై వాలుతున్న ఈగలు ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలపై వాలడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రమయ్యే సరికి గుంపులుగా దోమలు దాడి చేయడంతో మలేరియా, ఫైలేరియా బారిన పడే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు కాలువల్లోని పూడిక తొలగించడంతో పాటు రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వార్డుల్లో సిబ్బందితోపాటు చెత్త తరలించే బండ్ల సంఖ్య పెంచి పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

రోడ్డు మధ్య ప్రమాదకరంగా గొయ్యి



సూర్యతేజనగర్ వద్ద రోడ్డు మధ్యలో గొయ్యికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ కూడలి చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి ఆరిలోవ వెళ్లే రహదారిపై సూర్యతేజనగర్ వద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ జీవీఎంసీ నీటి సరఫరా కోసం అమర్చిన అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ సుమారు రెండు వారాల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో ఇక్కడ నీరు పైకి చిమ్మడంతో నీటి సరఫరా విభాగం సిబ్బంది దానికి మరమ్మతులు చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు మధ్యలో గొయ్యి తవ్వి సరిగా పూడ్చకుండా వదిలేశారు. ఇటీవల వర్షాలకు అందులో మట్టి కిందకు కూరుకుపోయి బురదమయమైంది. దీంతో సిబ్బంది ఆ గొయ్యికి ఇరువైపులా రెండు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వదిలేశారు. రోడ్డు మధ్యలో ఉన్న ఈ గొయ్యి వాహనచోదకులకు ఆటంకంగా మారింది. రాత్రి వేళల్లో ఇక్కడి బోర్డులను ఢీకొని వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యి పూడ్చి... రోడ్డు నిర్మించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు



మాట్లాడుతున్న వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం : ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నామని వీసీ ఆచార్య రాజశేఖర్ తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వార్షిక స్పోర్ట్స్ బోర్డు సమావేశం ఏయూ పరిపాలనా విభాగం ఎగ్జిక్యూటివ్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ముందుగా గత ఏడాది పతకాలు సాధించిన ఏయూ క్రీడాకారులను అభినందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు నిర్వహించే విధంగా సింథటిక్ క్రీడా మైదానం, ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్‌ను ఆదేశించారు. ఇతర యూనివర్సిటీల్లో నిర్వహించే పోటీలకు వెళ్లే క్రీడాకారుల డీఏ పెంపు విషయం ఆలోచిస్తామన్నారు. ప్రతీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్లను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ ఈ ఏడాది పురుషులు, మహిళలను 94 క్రీడాంశాల్లో పోటీలకు పంపుతున్నట్లు తెలిపారు. అలాగే సౌత్ ఇండియా యూనివర్సిటీ క్రికెట్ పోటీలను ఈ ఏడాది ఏయూ వేదికగా నిర్వహించనున్నామని తెలిపారు.

జైల్ సందర్శన



జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ : జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు బుధవారం విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఇక్కడి ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో మాట్లాడి ఉచిత న్యాయవాదుల సదుపాయం గురించి వివరించారు. న్యాయ సలహాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుర గృహాల పరిశీలన

విశాఖ కేంద్ర కారాగారం పర్యటన అనంతరం డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు దీన్‌దయాల్‌పురం వద్ద గల ప్రభుత్వ బాలుర గృహం, ప్రభుత్వ బాలుర పరిశీలన, ప్రత్యేక గృహాలను సందర్శించారు. ఆయా గృహాల్లో బాలురకు కల్పిస్తున్న వసతులు, వంట గదులు, ఆహారం, వైద్య సేవలు, విద్యా సదుపాయాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గృహాల పర్యవేక్షణాధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



జీవీఎంసీ 10వ వార్డు తోటగరువులో మహిళకు కరపత్రం అందిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

ఆరిలోవ : సాధారణ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ 10, 13వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పదో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, స్థానిక నాయకులతో కలిసి తోటగరువులో ఇంటింటికీ మొల్లి అప్పారావు వెళ్లారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలను అందరికీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారన్నారు. యువతకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత యువతకు ఇచ్చిన హామీ నెరవేర్చకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని పక్కనబెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాస్, స్థానిక నాయకులు కంటుబోతు తులసి, సయ్యద్‌అబ్దుల్ రావూఫ్, చింతా శ్రీను, గంగుల ఆనంద్, సారిపల్లి శ్రీను, బి.సూరి, పోలిరాజు, తనూజ, యామిని, రామాయమ్మ, వరలక్ష్మి, అప్పలకొండ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 13వ వార్డు పరిధి పైనాపిల్‌కాలనీలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేశారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వానపల్లి ఈశ్వరరావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, కె.సుబ్బారావు, పాండ్రంకి శ్రీను, కృష్ణంరాజు, బంగారమ్మ, భాస్కర్, కాకర గోవింద్, దుర్గారావు, పోలరావు, రామారావు, సాయిబాబు పాల్గొన్నారు.

18వ వార్డులో ఇంటింటికీ చంద్రబాబు మోసాలు

ఎంవీపీ కాలనీ : సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు 2024 ఎన్నికల్లో అడ్డదారిలో గద్దెనెక్కారని ఆరోపించారు. ఏడాదిన్నర పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలపై ప్రజలంతా ఆ పార్టీల నాయకులను నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పేర్ల విజయచందర్, పార్టీ నాయకులు వి.చంటి, కె.రవితేజ, జె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో మైక్రో ఆర్గానిజం డే



అతిథికి జ్ఞాపిక అందిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్నేషనల్ మైక్రో ఆర్గానిజం డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ మానవాళికి మేలు చేసే, కీడు చేసే రెండు విధాల సూక్ష్మజీవులు ఉంటాయన్నారు. ఇటీవల కేరళలో వెలుగు చూసిన ఒక బ్యాక్టీరియా మనుషుల మెదడుపై ప్రభావం చూపిందని గుర్తు చేశారు. ఇటువంటి అంశాలు ఒక నూతన సవాల్‌గా నిలుస్తాయని, వీటిపై పరిశోధనలు చేయాలని సూచించారు. తరగతి గదిలో పుస్తకాల నుంచి పొందిన జ్ఞానానికి ప్రయోగాలలో ప్రత్యక్షంగా నేర్చుకునే విధానానికి ఎంతో వ్యత్యాసం ఉంటుందని చెప్పారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ మానవ ఆరోగ్యం బయోలాజికల్, సైకలాజికల్ అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు. విభాగాధిపతి ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు వర్తమాన అంశంపై అవగాహన కల్పించేలా సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ అహ్మద్ బాష, డాక్టర్ ధనశేఖర్ ప్రసంగించారు. మైక్రోస్కోప్‌లో వివిధ సూక్ష్మజీవులను వీక్షించే అవకాశం విద్యార్థులకు కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డాక్టర్ పి.లక్ష్మి, డాక్టర్ పి.రాజా రమేష్ కుమార్, ఆచార్య పద్దయ్య, ఆచార్య వి.లక్ష్మి, ఆచార్య పి.రాధిక తదితరులు ప్రసంగించారు.

దారి లేక నిరుపయోగంగా ఓపెన్ జిమ్



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద జిమ్ పరికరాల చుట్టూ మట్టి దిబ్బలు, తుప్పలు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు దారి మూసుకుపోయింది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలు, పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. వీటికోసం జీవీఎంసీ అధికారులు ఒక్కోచోట సుమారు రూ.5 లక్షలు ఖర్చుచేసి వివిధ వ్యాయామ పరికరాలు అమర్చారు. ఇందులో భాగంగా ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద రోడ్డు పక్కన జిమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడి వ్యాయామ పరికరాలను యువకులు, పిల్లలు రోజూ వినియోగించుకునేవారు. అయితే సుమారు ఆరు నెలలుగా ఈ జిమ్‌కు వెళ్లే దారి మూసుకుపోయింది. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనుల్లో భాగంగా ఈ జిమ్ ముందు తవ్వేసి మట్టి దిబ్బలు వేసేశారు. దీంతోపాటు చుట్టూ పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. మట్టి దిబ్బలు దాటుకుంటూ పిల్లలు వెళ్లలేకపోవడంతో ఆ జిమ్ పరికరాలు నిరుపయోగంగా మారి తుప్పు పడుతున్నాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి ఇక్కడి మట్టి దిబ్బలు చదునుచేసి జిమ్‌కు దారి శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎంవీపీ కాలనీ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణను కోరారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీ సెక్టార్ – 4లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏపీ భవన్, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డుల్లో సభ్యులుగా ఉన్న కార్మికులు సంక్షేమ పథకాల కోసం పెట్టుకున్న 50 వేల అర్జీలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వెలగపూడిని కోరారు. దీంతోపాటు 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో కార్మికులు సేద తీరేందుకు కనీసం ఓ భవనం సముదాయం నిర్మించలేదని వాపోయారు. ఇప్పటికైనా కార్మికుల కోసం భవనం నిర్మించాలని వెలగపూడిని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోట సత్తిబాబు, సంఘం నాయకులు వైఎస్ మూర్తి, గరికిన నూకరాజు, శివారెడ్డి, బోర రమణ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత సాగరతీరం అందరి బాధ్యత



పెదజాలరిపేట తీరాన్ని శుభ్రపరుస్తున్న విద్యార్థులు, సంస్థల ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ : సురక్షిత సాగరతీరమే లక్ష్యంగా విశాఖ వాసులంతా కృషి చేయాలని మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మిడి మహేష్ కోరారు. బుధవారం అంతర్జాతీయ తీర ప్రాంత పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా పెదజాలరిపేట తీరాన్ని విద్యార్థులు శుభ్రం చేశారు. మత్స్యకార సంక్షేమ సమితి, ఇన్ కాయిస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్వచ్ఛసాగర్ – సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 252 మత్స్యకార గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తీరాన్ని అనుకుని ఉన్న గెడ్డలను, బీచ్‌ను శుభ్రం చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. సముద్ర తీరాన్ని కాలుష్యరహితంగా, పరిశుభ్రంగా ఉంచుకునేందుకు నగర వాసులంతా కలిసి రావాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను గెడ్డల్లో పడేయకుండా చూడాలని సూచించారు. 820 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించినట్లు తెలిపారు. నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సోమేష్‌రెడ్డి

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికవర్ హాస్పిటల్ సమీపంలో సీరపు సోమేష్‌రెడ్డి (27) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భీమిలిలోని రాయపాలెంలో నివసిస్తున్నాడు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమేష్‌రెడ్డి తండ్రికి ఈ నెల 12న పక్షవాతం రావడంతో ఎంవీపీ కాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో చేర్పించారు. తండ్రితోపాటు హాస్పిటల్‌కు వచ్చిన సోమేష్‌రెడ్డి 15న తెల్లవారుజాము నుంచి కనిపించ లేదు. ఈ క్రమంలో ఇంటిలో సూసైడ్ నోట్‌ను అతని తల్లి గుర్తించింది. ఓ యువతి ప్రేమ, వివాహం పేరుతో వేధించడంతో పాటు మహిళ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసిందని... మానసిక క్షోభ భరించలేకపోతున్నట్లు సోమేష్‌రెడ్డి అందులో పేర్కొన్నాడు. ఫోన్, పర్సు ఇంట్లో వదిలేసి వెళ్లిపోయిన సోమేష్‌రెడ్డి ఆచూకీ లభించలేదని సోదరుడు ఆదిత్యశేషుసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు కోరారు.

కృష్ణా కళాశాలలో సీడ్ బాల్స్ తయారీ



సీడ్ బాల్స్ తయారు చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ విద్యార్థులు సీడ్ బాల్ తయారీని బుధవారం చేపట్టారు. విద్యార్థులు వివిధ రకాల విత్తనాలు సేకరించి మట్టిలో కలిపి, తర్వాత వాటిని బంతులుగా తయారు చేసి సూర్యకాంతిలో ఆరబెట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఉపయోగకరమైన విత్తనాలను సేకరించి పచ్చదనాన్ని పెంచడానికి పార్కుల్లో చల్లాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంచినందుకు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యబీఏ, హరితకృష్ణ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఉమా మహేశ్వరరావు, అకడమిక్ అడ్వైజర్ కె.శ్రావణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జి.విజయ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న కాలనీ వాసులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ సంజయ్ గాంధీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు బుధవారం పందిరి రాట వేశారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో కనకదుర్గ అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి, పూజలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు, మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. 22న ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం భక్తుల స్వహస్తాలతో చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటరావు శర్మ, స్థానికులు పాల్గొన్నారు.

హిడెన్ స్ప్రౌట్స్‌లో మోదీ జన్మదినం

ఎంవీపీ కాలనీ : హిడెన్ స్ప్రౌట్స్ దివ్యాంగుల పాఠశాలలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు కేక్ కట్ చేసి మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి అందిస్తున్న సేవలను, పిల్లలు, మానసిక వికలాంగుల పట్ల చూపిస్తున్న ఆదరణను కొనియాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలను సమాజంలో భాగస్వాములను చేసే విధంగా పెద్ద ఎత్తున సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.